RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in




సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 234 | పేజీలు : 08 | గురువారం | 03-09-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.

# రాజ్‌నాథ్ ను ఆహ్వానించిన సీఎం



2

**ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన..**

**రాజ్‌నాథ్‌సింగ్, రామ్మోహన్‌నాయుడితో భేటీ**

**ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 సమ్మిట్ కు రాజ్‌నాథ్ ను ఆహ్వానించిన రేవంత్**

**డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి కేటాయించాలని విన్నపం**

**రాష్ట్రంలో విమానాశ్రయాల విస్తరణపై రామ్మోహన్ తో చర్చించిన సీఎం**

హైదరాబాద్ పల్స్,డెస్క్

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో వరుసగా భేటీ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి పలు కీలక అంశాలపై కేంద్ర మంత్రులతో చర్చలు జరిపారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'కు రాజ్ నాథ్ సింగ్ ను ముఖ్య అతిథిగా సీఎం ఆహ్వానించారు. ఈ గ్లోబల్ సమ్మిట్‌లో భాగమైన డిఫెన్స్ ఎక్స్‌పోలో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ భాగస్వామ్యం వహించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర వద్ద ప్రతిపాదించిన డీఆర్‌డీఎల్



## కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను..

**రాజ్‌గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారన్న రాజ్‌గోపాల్ రెడ్డి**

**నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరగదని వ్యాఖ్య** 2

**వైఎస్సార్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని వెల్లడి**

**'సీఎం.. సీఎం' అంటూ కార్యకర్తల నినాదాలపై కీలక వ్యాఖ్యలు**

**'ఆ సమయం వస్తే బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు' అని వ్యాఖ్య**



## రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోండి

2

**నాపై కాదు..ముందు రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోండి**

**ఢిల్లీలో కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు!**

**ఢిల్లీలో పార్టీ అధిష్ఠానాన్ని కలిసిన కొండా సురేఖ**

**పార్టీలో బీసీ నేతలను టార్గెట్ చేస్తున్నారని విమర్శ**

**అధిష్ఠానం తనను రాజీనామా చేయాలని కోరలేదని వెల్లడి**

హైదరాబాద్ పల్స్,డెస్క్

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ మంత్రి కొండా సురేఖ... సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈరోజు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె... తనపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చర్యలు

## వరదల వేళ భారత్ అండ..

**నేపాల్ పార్లమెంట్‌లో ప్రధాని బాలేన్ షా ప్రశంసలు**



2

## "ఎటు చూసినా విధ్వంసం,వికృతమే"..

**కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై కేటీఆర్ ఫైర్**

**కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల**

**కాంగ్రెస్ అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ విమర్శ**

**రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ**

**రుణమాఫీ హామీని పూర్తిగా అమలు చేయలేదన్న కేటీఆర్**

**కాళేశ్వరం విషయంలో రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ**



2

హైదరాబాద్ పల్స్,డెస్క్

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న




2

## హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లను కూల్చివేస్తున్నారు

హైదరాబాద్ పల్స్,డెస్క్

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ వెయ్యి రోజుల కాలం పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలు, నెరవేర్చని హామీలతోనే సాగిందని ఆమె

## కేసులన్నీ వాపస్

**డీఎంకే హయాంలోని ఆ కేసులన్నీ వాపస్: సీఎం విజయ్ ప్రకటన**

**రైతులు, ఉపాధ్యాయులపై నమోదైన కేసుల ఎత్తివేతకు సీఎం విజయ్ ఆదేశం**

**గత డీఎంకే ప్రభుత్వ హయాంలో నమోదైన కేసులు**

**సిప్‌కాట్, పరందూర్ ఎయిర్‌పోర్ట్ నిరసనకారులకు ఊరట**

**ప్రజల్లో విశ్వాసం పెంచేందుకే ఈ నిర్ణయమన్న సీఎం విజయ్**

**నీట్, ఎన్ఎల్‌సీ నిరసనకారుల కేసులపైనా కొనసాగుతున్న డిమాండ్లు**



2

హైదరాబాద్ పల్స్,డెస్క్

తమిళనాడులో అధికారంలోకి వచ్చిన టీవీకే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత డీఎంకే ప్రభుత్వ హయాంలో రైతులు, ఉపాధ్యాయులపై నమోదైన కేసులను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్లు ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీలో ప్రకటించారు. ఈ నిర్ణయం ద్వారా నిరసనకారులకు భారీ ఊరట

## ఇది భిక్ష కాదు

**భారత్,చైనా,అమెరికా నుంచి**

**నష్టపరిహారం కోరిన నేపాల్ మంత్రి**

**నేపాల్ ఆకస్మిక వరదల వల్ల ఇప్పటి వరకు 11 వందల మందికి పైగా మృతి**

**పారిశ్రామిక దేశాలు విడుదల చేసే ఉద్గారాల వల్ల తాము మూల్యం చెల్లించుకుంటున్నామన్న నేపాల్**

**తమకు నష్టపరిహారం చెల్లించడం చట్టపరమైన బాధ్యత అని వ్యాఖ్య**



2

హైదరాబాద్ పల్స్,డెస్క్

నేపాల్‌ను ముంచెత్తిన ఘోర జలప్రళయం తీవ్ర నష్టాన్ని మిగిల్చిన వేళ, ఆ దేశ ప్రభుత్వం అంతర్జాతీయ వేదికలపై కీలక

## ఎంతో బాధించింది

**మాజీ ఎమ్మెల్యే షకీల్ అహ్మద్**

**కవిత కంటతడి పెట్టుకోవడం ఎంతో బాధించింది: మాజీ ఎమ్మెల్యే షకీల్ అహ్మద్**

**భోధన్ నుంచి కవిత పోటీ చేయాలనుకుంటే స్వాగతిస్తానన్న షకీల్ అహ్మద్**

**కవిత భర్త ఊరు బోధన్ నియోజకవర్గంలోనే ఉందని వ్యాఖ్య**

**కవిత కుటుంబంలో ఏం జరిగిందో తనకు తెలియదన్న షకీల్**



2

## 7.8 శాతం వృద్ధి..

**అయినా మోదీ 'బంగారం కొనొద్దంటున్నారేంటి? అసలు లెక్క ఇదే!**

2

**బంగారం కొనొద్దని మోదీ మరోసారి పిలుపు**

**విదేశాల్లో పెళ్లిళ్లకూ దూరంగా ఉండాలని విజ్ఞప్తి**

**బంగారం దిగుమతులతో భారీగా విదేశీ మారకం ఖర్చు**

**చమురు ధరల పెరుగుదలతో మరింత ఒత్తిడి**

**జూన్ త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదు**

హైదరాబాద్ పల్స్,డెస్క్

దేశ ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధితో దూసుకెళుతోంది. అయినా ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం ప్రజలకు ఓ కీలక విజ్ఞప్తి చేశారు. అవసరం లేకపోతే బంగారం కొనొద్దు.. సరదా కోసం విదేశాలకు వెళ్లొద్దు.. విదేశాల్లో పెళ్లిళ్లు చేసుకోవద్దు అని సూచించారు. దేశం బలంగా ఉన్న సమయంలోనే

# రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోండి

మొదటి పేజీ రువాయి

తీసుకోవాలని పార్టీ పెద్దలను డిమాండ్ చేశారు.తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేస్తూ చర్యలు తీసుకోవాలనుకోవడం సరికాదని సురేఖ స్పష్టం చేశారు. మహిళలు స్వతంత్రంగా జీవించాలని రాహుల్ గాంధీ ఎప్పుడూ చెబుతుంటారని అన్నారు. తన కుమార్తెను తీవ్రంగా రెచ్చగొట్టడం వల్లే ఆమె ఆ వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందని చెప్పారు. పార్టీలో బీసీలకు ఒక న్యాయం... రెడ్డి సామాజిక వర్గాలకు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలు ఎంతోమంది అనుచిత వ్యాఖ్యలు చేసినా చర్యలు తీసుకోలేదని, కేవలం బీసీలనే టార్గెట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు.పదేళ్లు తానే సీఎంగా ఉంటానని రేవంత్‌రెడ్డి సొంతంగా చెప్పుకోవడం ఎంతవరకు సమంజసం? అని సురేఖ ప్రశ్నించారు. రాష్ట్ర కేబినెట్‌లోని పలువురు మంత్రులపై అనేక ఆరోపణలు ఉన్నాయని.. రేవంత్ పాలనపై మంత్రులు, సీనియర్ నేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు తనను రాజీనామా చేయమని అధిష్ఠానం కోరలేదని, జరిగిన పరిణామాలన్నింటినీ రాతపూర్వకంగా హైకమాండ్‌కు నివేదించినట్లు తెలిపారు.

# కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను..

మొదటి పేజీ రువాయి

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన కొందరు కాంగ్రెస్‌ను కబ్జా చేసి అధికారం చెలాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను తాను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు.తెలంగాణలో వైఎస్ రాజశేఖర్ రెడ్డికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారని రాజ్‌గోపాల్ రెడ్డి అన్నారు. తాము వైఎస్సార్ నిజమైన శిష్యులమని పేర్కొన్నారు. వైఎస్సార్ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తానని, వైఎస్సార్‌ను ఎప్పటికీ మరచిపోబోనని అన్నారు.ఎంతమంది కుట్రలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా తాను భయపడేది లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకున్న నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగకుండా చూస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన రాజ్‌గోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 'నన్ను సీఎం.. సీఎం అని పిలుస్తున్నారు. ఆ సమయం గనక వస్తే.. దాన్ని బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు' అని అన్నారు.రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొచ్చి 'రాజన్న రాజ్యం' కొనసాగిస్తామని రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# ఇది భిక్ష కాదు

మొదటి పేజీ రువాయి

విజ్ఞప్తి చేసింది. ప్రపంచంలోనే అత్యధికంగా గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేస్తున్న భారత్, చైనా, అమెరికా దేశాల నుంచి 'వాతావరణ మార్పుల నష్టపరిహారం' కోరుతూ నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ సంచలన ప్రకటన చేశారు.భోటేకోషి నదిలో సంభవించిన ఆకస్మిక వరదల వల్ల ఇప్పటికే 1,100 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది గల్లంతయ్యారు. ఈ తీవ్ర విపత్తు వాతావరణ మార్పుల వల్ల హిమనీనదాలు (గ్లేసియర్లు) విరుచుకుపడటం వల్లే సంభవించిందని శిశిర్ ఖనాల్ పేర్కొన్నారు. వాతావరణ మార్పులకు తమ దేశం కారణం కాకపోయినా, అతిపెద్ద పారిశ్రామిక దేశాలు విడుదల చేసే ఉద్గారాల వల్ల తాము తీవ్ర మూల్యం చెల్లించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తమకు ఇచ్చే సాయం లేదా భిక్ష కాదని, బాధితులకు చెల్లించాల్సిన చట్టపరమైన, నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు.తమ దౌత్య విధానాన్ని 'సాయం కోరడం' నుంచి 'న్యాయం, నష్టపరిహారం పొందే' దిశగా మారుస్తున్నట్లు వెల్లడించారు. ఈ అంశాన్ని ఐక్యరాజ్యసమితి గ్లోబల్ లాస్ అండ్ డ్యామేజ్ ఫండ్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు... రానున్న ఐరాస సర్వసభ్య సమావేశంలో ఈ అంశాన్ని లేవనెత్తనున్నట్లు సమాచారం. దెబ్బతిన్న మౌలిక సదుపాయాలు, పునర్నిర్మాణానికి ప్రాథమికంగా 4 నుంచి 5 బిలియన్ డాలర్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు.



# రాజ్‌నాథ్ ను ఆహ్వానించిన సీఎం

మొదటి పేజీ రువాయి

ప్రాజెక్టుకు ఉచితంగా భూమి కేటాయించాలని కోరారు. ఇక ఆదిలాబాద్ విమానాశ్రయం పునరుద్ధరణ అంశాన్ని రాజ్‌నాథ్ దృష్టికి తీసుకెళుతూ.. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ పూర్తి చేశామని, అవసరమైతే మరో 750 ఎకరాలు సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.అనంతరం పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో సమావేశమైన రేవంత్ రెడ్డి... రాష్ట్రంలోని విమానాశ్రయాల విస్తరణ, అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా ఆదిలాబాద్, వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయాల పనులను వేగవంతం చేయాలని, కొత్త విమానాశ్రయాల ప్రతిపాదనలకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి వెంట మంత్రి గడ్డం వివేక్, ఎంపీలు మల్లు రవి, బలరామ్ నాయక్, అనిల్ కుమార్ యాదవ్ తదితర నేతలు ఈ భేటీలలో పాల్గొన్నారు.

# కేసులన్నీ వాపస్

మొదటి పేజీ రువాయి

లభించినట్లయింది.2021 మే నుంచి 2026 మధ్య కాలంలో అప్పటి ఎం.కె. స్టాలిన్ ప్రభుత్వం సిప్‌కాట్ పారిశ్రామిక వాడ, పరందూర్ విమానాశ్రయం వంటి ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసనలు తెలిపిన వారిపై అమానుషంగా వ్యవహరించిందని విజయ్ విమర్శించారు. ఆ సమయంలో రైతులు, ఉపాధ్యాయులపై పలు కేసులు నమోదు చేశారని, అవి ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.ప్రజల న్యాయమైన డిమాండ్లకు తమ ప్రభుత్వం అండగా నిలుస్తుందని విజయ్ స్పష్టం చేశారు. కేసుల ఎత్తివేత నిర్ణయం ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఇదిలా ఉండగా, 'నీట్'కు వ్యతిరేకంగా నిరసన తెలిపిన విద్యార్థులపై కేసులను ఉపసంహరించుకోవాలనిసీపీఐ, ఎన్‌ఎల్‌సీ ఆందోళనకారులపై కేసులను రద్దు చేయాలని పీఎంకే పార్టీలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. అయితే, ఈ డిమాండ్లపై టీవీకే ప్రభుత్వం నుంచి ఇంకా ఎటువంటి స్పందన రాలేదు.

# ఎంతో బాధించింది

మొదటి పేజీ రువాయి

నిజామాబాద్ జిల్లా రాజకీయాల్లో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అహ్మద్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. రాబోయే ఎన్నికల్లో కల్వకుంట్ల కవిత బోధన్ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావిస్తే ఆమెను మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తూ ఘన స్వాగతం పలుకుతానని ఆయన స్పష్టం చేశారు.కవిత భర్త అనిల్ స్వగ్రామం 'పొత్తంగల్' బోధన్ నియోజకవర్గం పరిధిలోనే ఉందని, ఆ రకంగా బోధన్ నియోజకవర్గానికి ఆమె సొంత అత్తగారి ఊరు, కోడలిగా పోటీ చేయడానికి పూర్తి హక్కు, అర్హత ఉన్నాయని పేర్కొన్నారు.ఇటీవల కవిత బహిరంగంగా కన్నీళ్లు పెట్టుకున్న ఘటనపై షకీల్ స్పందిస్తూ... ఆ దృశ్యం చూసి తనకు తీవ్ర బాధ కలిగిందని, అది ఆమె వ్యక్తిగత వేదన కావచ్చునని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, కవిత కుటుంబంలో అంతర్గతంగా ఏం జరిగిందనే దానిపై తనకు ఎలాంటి సమాచారం లేదని వ్యాఖ్యానించారు.సొంత నియోజకవర్గాన్ని వేరొకరికి ఆఫర్ చేస్తూ షకీల్ చేసిన ఈ ప్రకటనతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై కొత్త చర్చ మొదలైంది. ఆయన బీఆర్‌ఎస్‌ను వీడి కొత్త రాజకీయ దారి వెతుక్కుంటారా లేక పార్టీ మారనున్నారా అనే ఊహాగానాలు నిజామాబాద్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లను కూల్చివేస్తున్నారు

మొదటి పేజీ రువాయి




ధ్వజమెత్తారు.గడిచిన వెయ్యి రోజుల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల బతుకులను బాగు చేసింది ఏమీ లేదని, కేవలం కొందరి సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చిందని మండిపడ్డారు. హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం, సంక్షేమ గురుకులాల్లో భద్రత లేక విద్యార్థులు వరుసగా మరణించడం, జాబ్ నోటిఫికేషన్లు రాక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకోవడం, పంటలకు మద్దతు ధర లేక అన్నదాతల బలవన్మరణాలు పెరిగిపోవడం.. వీటికి తోడు రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించి నేరాలు నిత్యకృత్యం కావడమే ఈ ప్రభుత్వం సాధించిన అసలైన 'ప్రగతి' అని ఎద్దేవా చేశారు.ఉద్యమకారుల నెత్తురు చిందిన నాటి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, ఈ సర్కార్ కాలం చెల్లిపోయిందని హెచ్చరించారు. ప్రభుత్వ అరాచకాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని, ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడి చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలో మళ్లీ ప్రజల ప్రభుత్వమే అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

# "ఎటు చూసినా విధ్వంసం,వికృతమే"

మొదటి పేజీ రువాయి

సందర్భంగా బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం కనిపిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఇది వెయ్యి రోజుల పాలన కాదని.. 'పీడన' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ఈ శతాబ్దపు అతిపెద్ద మోసంగా అభివర్ణించారు. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టి 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులు పెద్దగా చేయకుండానే రాష్ట్ర ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు.రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రూ.20 వేల కోట్లు మాత్రమే చేశారని కేటీఆర్ అన్నారు. రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టు పెట్టారని గుర్తుచేశారు. మాఫీ పూర్తిగా చేయకుండా 70 శాతం మంది రైతులను మోసం చేశారని ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని నాశనం చేసిందని విమర్శించారు.కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు మోయడం, పదవుల కోసం కొట్లాడుకోవడం తప్ప మరేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు పథకాన్ని నిలిపివేసి రాహుల్ బంధుకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోమని హెచ్చరించారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. మిస్ వరల్డ్ పోటీలు, లియోనెల్ మెస్సీ కార్యక్రమాలకు భారీగా నిధులు ఖర్చు చేసిన ప్రభుత్వం, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు చేయడం లేదని విమర్శించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ పేరుతో జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీతో కలిసి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు.. తెలంగాణలో నిరుద్యోగులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు.

# 7.8 శాతం వృద్ధి..

మొదటి పేజీ రువాయి

ఇలాంటి జాగ్రత్తలు ఎందుకు చెబుతున్నారు?
దీని వెనుక పెద్ద ఆర్థిక లెక్కే ఉంది.
బంగారంపై ఎందుకంత దృష్టి?
భారత్ తన బంగారం అవసరాల్లో దాదాపు మొత్తం దిగుమతులపైనే ఆధారపడుతోంది. అంటే మనం బంగారం కొన్న ప్రతిసారీ దేశం నుంచి విదేశీ మారకం బయటకు వెళ్తుంది. దిగుమతులు పెరిగితే వాణిజ్య లోటు పెరిగే అవకాశం ఉంటుంది. డాలర్లకు డిమాండ్ పెరిగితే రూపాయిపై కూడా ఒత్తిడి పడుతుంది.ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమైన ఆర్థిక సంవత్సరంలో తొలి నాలుగు నెలల్లో బంగారం దిగుమతులు గత ఏడాదితో పోలిస్తే 32 శాతానికి పైగా పెరిగాయి. జులైలో భారత్ వస్తువుల వాణిజ్య లోటు దాదాపు 32 బిలియన్ డాలర్లకు చేరింది. జనవరి తర్వాత ఇదే అత్యధిక స్థాయి.
చమురు మంటకు బంగారం తోడైతే?
భారత్ తన ముడి చమురు అవసరాల్లో 88 శాతానికి పైగా దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు, హర్మూజ్ జలసంధి వద్ద అంతరాయాల భయాలు చమురు మార్కెట్లను కలవరపెడుతున్నాయి.చమురు ధరలు పెరిగితే భారత్‌కు మరిన్ని డాలర్లు అవసరమవుతాయి. అదే సమయంలో బంగారం దిగుమతులు కూడా పెరిగితే విదేశీ మారకంపై ఒత్తిడి మరింత ఎక్కువవుతుంది. అందుకే అవసరం లేని దిగుమతుల్ని తగ్గించాలన్నది మోదీ సూచనలోని ప్రధాన ఉద్దేశం.
విదేశాలకు వెళ్లొద్దన్నది ఎందుకు?
విదేశీ పర్యటన అంటే విమాన టికెట్లు, హోటళ్లు, ఆహారం, స్థానిక రవాణా వంటి వాటిపై విదేశాల్లో ఖర్చు చేయడం. ఇక డెస్టినేషన్ వెడ్డింగ్ అయితే ఖర్చు మరింత భారీగా ఉంటుంది.అందుకే మోదీ అన్ని విదేశీ ప్రయాణాలను ఆపాలని చెప్పలేదు. అత్యవసరం కాని పర్యటనలు, విదేశీ పెళ్లిళ్లను మాత్రం మరోసారి ఆలోచించండి అన్నదే ఆయన సందేశం. ఆ డబ్బును దేశంలోనే ఖర్చు చేస్తే స్థానిక వ్యాపారాలు, సేవలకు ప్రయోజనం కలుగుతుందన్నది స్వదేశీ ఆలోచన.
గతంలోనూ ఇదే మాట
మేలో అమెరికా-ఇరాన్ ఘర్షణల ప్రభావం తీవ్రంగా ఉన్న సమయంలోనూ మోదీ ఇదే తరహా పిలుపునిచ్చారు. ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను వాయిదా వేయాలని, అవసరం లేని విదేశీ ప్రయాణాలను తగ్గించాలని కోరారు. పెట్రోల్, డీజిల్ ఆదా చేయడం, ప్రజా రవాణా ఉపయోగించడం, కార్‌పూలింగ్ చేయడం వంటి సూచనలు కూడా చేశారు.
7.8 శాతం వృద్ధి ఉన్నా ఎందుకీ జాగ్రత్త?
జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి నమోదు చేసింది. ఇది అంచనాల కంటే మెరుగైన ఫలితమే. అయితే మార్చి త్రైమాసికంలోని 8.6 శాతంతో పోలిస్తే వృద్ధి తగ్గింది.ప్రపంచ యుద్ధాలు, చమురు ధరలు, ద్రవ్యోల్బణం, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాల వంటి ముప్పులు ఇంకా ఉన్నాయి. అందుకే ప్రస్తుతం ఉన్న ఆర్థిక బలాన్ని భవిష్యత్తు కోసం ఉపయోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

# వరదల వేళ భారత్ అండ..

మొదటి పేజీ రువాయి

నేపాల్‌లో భారీ వరదలు, కొండచరియల విరిగిపడటంతో తీవ్ర నష్టం జరిగిన వేళ భారత్ అందించిన సకాల సాయంపై ఆ దేశ ప్రధాని బాలేన్ షా ప్రశంసలు కురిపించారు. భారత్, చైనా సకాలంలో సహాయక చర్యలకు మద్దతు ఇచ్చాయని నేపాల్ పార్లమెంట్‌లో తెలిపారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో అంతర్జాతీయ సాయం తిరస్కరించే ప్రశ్నే తలెత్తదని స్పష్టం చేశారు.వరదల ప్రభావాన్ని అంచనా వేసేందుకు భారత్, చైనా తమ సాంకేతిక నిపుణులను పంపాయని బాలేన్ షా చెప్పారు. విపత్తు సంభవించిన తొలిరోజు నుంచే నష్టాన్ని అంచనా వేసేందుకు వైమానిక పరిశీలనతో పాటు ఇతర మార్గాల్లో పరిస్థితిని పరిశీలించారని తెలిపారు. పరిస్థితులు అనుకూలించిన వెంటనే భారత సాంకేతిక నిపుణులు మారుమూల ప్రాంతాలకు కూడా చేరుకున్నారని పేర్కొన్నారు.వరదల ప్రాంతాల్లో బురద, మట్టి భారీగా పేరుకుపోవడంతో సహాయక చర్యలు అత్యంత కష్టంగా మారాయని బాలేన్ షా వివరించారు. ఎక్స్కవేటర్లు మాత్రమే కాదు.. సైన్యం, సాయుధ పోలీసు సిబ్బంది కూడా నిలబడేందుకు స్థలం లేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.నేపాల్‌లోని భోటేకోషి నది ఉప్పొంగడంతో రసువా ప్రాంతాన్ని భారీ వరదలు ముంచెత్తిన విషయం తెలిసిందే. ఈ విపత్తుకు వాతావరణ మార్పులే కారణమని బాలేన్ షా ఇటీవల పేర్కొన్నారు. ఇలాంటి విపత్తులను ఎదుర్కొనేందుకు ప్రపంచ స్థాయిలో సమన్వయం [illegible] నిర్వహణ వ్యవస్థ అవసరమని పిలుపునిచ్చారు.నేపాల్‌లో వరదల కారణంగా మృతుల సంఖ్య బుధవారం నాటికి 1,127కి చేరింది. వేలాది మంది గల్లంతైన నేపథ్యంలో సహాయక బృందాలు వారి కోసం గాలింపు కొనసాగిస్తున్నాయి. ఇప్పటివరకు నేపాల్ భద్రతా బలగాలు 6,541 మందిని ప్రభావిత ప్రాంతాల నుంచి రక్షించాయి. మరో 4,858 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది.భారత్ భారీ స్థాయిలో మానవతా, సాంకేతిక సహాయక చర్యలు చేపట్టింది. ప్రత్యేక టన్నెల్ రెస్క్యూ బృందాలు, వైద్య బృందాలు, డీఎన్ఏ ఆధారంగా మృతులను గుర్తించే ఫోరెన్సిక్ నిపుణులను నేపాల్‌కు పంపింది. బాధితులను రక్షించేందుకు భారత్ నుంచి ఇప్పటివరకు కనీసం 163 మందిని తరలించినట్లు విదేశాంగ శాఖ తెలిపింది.అత్యవసర సహాయక సామగ్రిలో భాగంగా భారత్ నాలుగు విడతల్లో తాత్కాలిక షెల్టర్లు, దుప్పట్లు, హైజీన్ కిట్లు, సోలార్ లైట్లు, మందులు పంపింది. 70 టన్నులకు పైగా దుప్పట్లు, స్లీపింగ్ బ్యాగులు, టార్పాలిన్లు, ప్లాస్టిక్ షీట్లు, హైజీన్ కిట్లను విమానాల ద్వారా నేపాల్‌కు తరలించింది. బాధితుల సహాయక చర్యల కోసం భారత విదేశాంగ శాఖతో పాటు ఖాట్మండు, బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయాల్లో 24 గంటల కంట్రోల్ రూమ్‌లు, హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేశారు.

# 420 హామీల అమలు కోసం బీఆర్ఎస్ సమరభేరి

### కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై మహారెడ్డి భూపాల్‌రెడ్డి విమర్శలు

### నారాయణఖేడ్‌లో భారీ ధర్నా




**నారాయణఖేడ్, సెప్టెంబర్ 02 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నారాయణఖేడ్‌లో ధర్నా నిర్వహించారు. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఎన్నికల ముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వాటి అమలులో విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా, హామీల అమలులో జాప్యం జరుగుతోందని విమర్శించారు. రైతులకు న్యాయం చేయాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పేదలకు సంక్షేమ పథకాలు అందించాలని వారు డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని మహారెడ్డి భూపాల్‌రెడ్డి తెలిపారు. నారాయణఖేడ్ ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని బీఆర్ఎస్ శ్రేణులు పేర్కొన్నాయి. ధర్నాలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైఎస్సార్ ఆశయాలే స్ఫూర్తిగా.. కాంగ్రెస్ నేతల నివాళి

### డోర్నకల్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమం



**మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 02 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**
ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలను కాంగ్రెస్ నాయకులు స్మరించుకున్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా డోర్నకల్ మున్సిపాలిటీలో బుధవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమం కోసం ఆయన అనేక కార్యక్రమాలు అమలు చేశారని నాయకులు పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలకు ప్రాధాన్యం ఇచ్చి, ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని తెలిపారు. అధికారాన్ని ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావించి సామాన్యుల సంక్షేమానికి పెద్దపీట వేసిన ఆయన విధానాలు నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కాలా సుమేర్ జైన్, మున్సిపల్ చైర్మన్ రాజకుమారి హరిబాబు, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ సాధనాల వెంకటేశ్వర్లు, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబా, కాంగ్రెస్ నాయకులు మాద శ్రీనివాస్, శీలం శ్రీనివాస్, రంజనీకాంత్, తారాచంద్, సర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ కరెన్సీ చలామణి ముఠా గుట్టురట్టు

### ముగ్గురు అరెస్ట్.. రూ.2.91 లక్షల నకిలీ నోట్లు, ముద్రణ సామగ్రి స్వాధీనం

### మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడి








**హైదరాబాద్, సెప్టెంబర్ 02 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
నకిలీ భారతీయ కరెన్సీ నోట్ల తయారీ, చలామణి కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు హైదరాబాద్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ తెలిపింది. వారి వద్ద నుంచి రూ. 2,91,100 విలువైన నకిలీ కరెన్సీ నోట్లు, ముద్రణ పరికరాలు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది. కమిషనర్ టాస్క్‌ఫోర్స్ శంషాబాద్ జోన్ బృందం బాలాపూర్ పోలీసులతో కలిసి విశ్వసనీయ సమాచారం మేరకు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. రమావత్ రాము అలియాస్ మహమ్మద్, రమావత్ మోతిలాల్, రమావత్ గాంధీని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో సుధీర్ జాన్ చేల అలియాస్ వంశీ పరారీలో ఉన్నట్లు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, నిందితులు నకిలీ కరెన్సీ నోట్ల తయారీ, చలామణికి అవసరమైన పరికరాలు, సామగ్రిని నవంకూర్చుకున్నట్లు విచారణలో వెల్లడైంది. తయారు చేసిన నకిలీ నోట్లను మార్కెట్‌లో చలామణి చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు ఆరోపించారు.

**స్వాధీనం చేసుకున్నవి**
నిందితుల వద్ద నుంచి 437 నకిలీ రూ.500 నోట్లు, 648 నకిలీ రూ.100 నోట్లు, 39 నకిలీ రూ.200 నోట్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వీటి మొత్తం విలువ రూ.2,91,100గా పేర్కొన్నారు. అదనంగా ఎప్సన్ కలర్ ప్రింటర్, కలర్ ఇమేజ్ స్కానర్, లామినేటర్, పేపర్ కట్టర్, వివిధ రంగుల ద్రవ రంగులు, బాండ్ పేపర్లు, వాటర్‌మార్క్‌కు ఉపయోగించిన కాగితాలు, ప్యాకింగ్ సామగ్రి, స్మార్ట్‌ఫోన్లు, ద్విచక్రవాహనం తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. జిరాక్స్ కోసం ఉపయోగించిన కొన్ని అసలు కరెన్సీ నోట్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు ఆన్‌లైన్ వీడియోల ద్వారా నకిలీ కరెన్సీ తయారీకి సంబంధించిన సమాచారం తెలుసుకుని, అవసరమైన పరికరాలు కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. తయారు చేసిన నకిలీ నోట్లను రాత్రి వేళల్లో వివిధ ప్రాంతాల్లో చలామణి చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన నిందితులు, స్వాధీనం చేసుకున్న ఆస్తిని తదుపరి విచారణ కోసం బాలాపూర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు కమిషనర్ టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. ఈ చర్యలో శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్, బాలాపూర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రధాని మోదీని రెచ్చగొట్టొద్దు.. పాక్‌ను ప్రపంచ పటంలో లేకుండా చేయగలరు: షిండే

### ఎస్‌సీవో సదస్సు గ్రూప్ ఫొటో నుంచి మోదీ చిత్రాన్ని కత్తిరించిన పాక్ చర్యపై ఆగ్రహం

### ఫొటోలు మార్చినంత మాత్రాన మోదీ అంతర్జాతీయ ప్రతిష్ఠను తగ్గించలేరు

### మోదీ తలచుకుంటే పాకిస్థాన్‌ను ప్రపంచ పటంలో లేకుండా చేయగలరని వ్యాఖ్యల



మహారాష్ట్ర (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి, సెప్టెంబర్ 02):
షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సు గ్రూప్ ఫొటో నుంచి భారత ప్రధాని నరేంద్ర మోదీ చిత్రాన్ని కత్తిరించి పాకిస్థాన్ పోస్టు చేయడంపై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తీవ్రంగా స్పందించారు. పాకిస్థాన్ పదేపదే భారత్‌ను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడటం సరికాదని, ఇలాంటి చిల్లర చేష్టలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ వ్యవహరించిన తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు.

**ప్రతిష్ఠను దెబ్బతీయలేరు:**
గ్రూప్ ఫొటో నుంచి ప్రధాని మోదీ చిత్రాన్ని తొలగించడం లేదా కత్తిరించడం వల్ల ఆయన ప్రతిష్ఠకు ఎలాంటి భంగమూ వాటిల్లదని షిండే స్పష్టం చేశారు. "దేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ మోదీకి ఉన్న గౌరవం, గుర్తింపుపై ఇలాంటి చర్యలు ఎలాంటి ప్రభావం చూపలేవు. ఒక ఫొటోను మార్చినంత మాత్రాన ఆయన స్థాయిని, భారతదేశ ప్రతిష్ఠను తగ్గించడం పాకిస్థాన్ వల్ల కాదు" అని పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారత ప్రధానికి లభిస్తున్న ప్రాధాన్యతను తట్టుకోలేకే పాక్ ఇటువంటి చర్యలకు దిగుతోందని విమర్శించారు.

**భారత్ సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేయొద్దు:**
పాకిస్థాన్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచిస్తూ షిండే హెచ్చరికలు జారీ చేశారు. ప్రధాని మోదీ తలచుకుంటే పాకిస్థాన్‌ను ప్రపంచ పటంలో లేకుండా చేయగలరని, భారత సామర్థ్యాన్ని తేలికగా తీసిపారేయవద్దని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం భారత్, పాకిస్థాన్ మధ్య రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో, ఎస్‌సీవో ఫొటో వివాదంపై ఏక్‌నాథ్ షిండే చేసిన ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

# శంకరంపేట(ఏ)లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'కాంగ్రెస్ బాకీ కార్డుల' పంపిణీ




**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 02, (నారాయణఖేడ్):**
మెదక్ జిల్లా శంకరంపేట(ఏ) మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు, పార్టీ నాయకుడు గుబ్బపు మచ్చేందర్ సూచనల ప్రకారం 'కాంగ్రెస్ బాకీ కార్డుల' పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు నెరవేర్చలేని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని, తీరా గెలిచాక వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, పేదలు ఇలా అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఇచ్చిన ఏ ఒక్క హామీని సక్రమంగా నెరవేర్చలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గ్రామగ్రామానా ఎండగడతామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది ఒక్క బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక గ్రామస్థులు పాల్గొన్నారు.

# సైబర్ సెక్యూరిటీలో గూగుల్ ముందడుగు.. 'జెమిని 3.8 ఫ్లాష్ సైబర్' విడుదల



టెక్ దిగ్గజం గూగుల్ సైబర్ సెక్యూరిటీ రంగంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. తమ అత్యంత శక్తివంతమైన సైబర్ సెక్యూరిటీ ఏఐ మోడల్ "జెమినీ 3.8 ఫ్లాష్ సైబర్"ను పరిచయం చేస్తున్నట్లు ఆ సంస్థ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రకటించారు. సైబర్ భద్రతకు సంబంధించిన లోపాలను అత్యంత వేగంగా గుర్తించి, వాటిని అంతే వేగంగా సరిదిద్దడంలో ఈ మోడల్ అద్భుతమైన పనితీరు కనబరుస్తుందని ఆయన 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఈ ఏఐ మోడల్ సామర్థ్యాన్ని పరీక్షించేందుకు నిర్వహించిన పరిశ్రమల ప్రామాణిక 'సైబర్‌జిమ్' బెంచ్‌మార్క్‌లో ఇది 86.2 శాతం స్కోరును సాధించిందని ఆయన తెలిపారు. అదేవిధంగా, లోపాలను సరిచేసే విషయంలో 'జఔజు-బెంచ్' పరీక్షలో 47.2 శాతం సామర్థ్యాన్ని ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. గూగుల్ అందిస్తున్న ఇతర ఫ్లాష్ మోడల్స్ తరహాలోనే ఇది కూడా వేగవంతమైన పనితీరును, తక్కువ ఖర్చుతో కూడిన లభ్యతను కలిగి ఉంటుందని సుందర్ పిచాయ్ వివరించారు. గూగుల్ నిర్వహించిన అంతర్గత పరీక్షల్లో దాదాపు 20 ప్రోగ్రామింగ్ భాషల్లోని లోపాలను కనుగొనడంలో ఈ మోడల్ 70 శాతం కంటే ఎక్కువ సక్సెస్ రేటును నమోదు చేసినట్లు సుందర్ పిచాయ్ వెల్లడించారు. అత్యున్నత స్థాయి పనితీరును కనబరుస్తూనే, "ఫ్లాష్" స్థాయి వేగంతో, సరసమైన ధరకే ఈ మోడల్ అందుబాటులోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు.



# టీఆర్పీలో చేరిన షాద్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

## నూతన షాద్‌నగర్ నియోజకవర్గ కార్యవర్గం ప్రకటన

**హైదరాబాద్, సెప్టెంబర్ 02 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) లో షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చేరినట్లు పార్టీ వెల్లడించింది. టీఆర్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి బంధారపు నర్సయ్య గౌడ్ సమక్షంలో ఈ చేరికలు జరిగినట్లు తెలిపింది. ఈ సందర్భంగా పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నూతనంగా చేరిన నాయకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం షాద్‌నగర్ నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా సంతోష్, ఉపాధ్యక్షుడిగా మీది కేరి రాధాకృష్ణ, కొందుర్గ్ మండల ఉపాధ్యక్షుడిగా మిద్దె ఎల్లరాజు, చౌదరిగూడ మండల అధ్యక్షుడిగా దుర్తల రాములు, రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధిగా బుస్సా జంగయ్య మంగలిని నియమించినట్లు పార్టీ పేర్కొంది. నూతన నాయకులకు తీన్మార్ మల్లన్న నియామక పత్రాలు అందజేసి అభినందించారు. తెలంగాణలో సామాజిక న్యాయం, బహుజన రాజ్యాధికార సాధన కోసం టీఆర్పీ పనిచేస్తోందని తీన్మార్ మల్లన్న తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నిర్వహించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తీన్మార్ మల్లన్న చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేసేందుకు రంగారెడ్డి జిల్లా నుంచి భారీగా జనసమీకరణ చేపడతామని జిల్లా అధ్యక్షుడు బండారు రమేష్ యాదవ్ తెలిపారు. మహిళలు, యువత, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రంగారెడ్డి జిల్లాలో టీఆర్పీని బలోపేతం చేసి రాజకీయ శక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రతి నియోజకవర్గం,



మండలం, గ్రామం, డివిజన్ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి ప్రజా సమస్యలపై కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల ప్రవీణ్ రాజ్, రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగ్ ముదిరాజ్, మహిళా అధ్యక్షురాలు బండారు విజయలక్ష్మి, జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ గుల్ల వాసుకి, శేరిలింగంపల్లి జనరల్ సెక్రటరీ కురుమూర్తి ముదిరాజ్, శేరిలింగంపల్లి ఆటో యూనియన్ అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ షాపింగ్, పెట్టుబడుల పేరుతో మోసాలపై అవగాహన అవసరం**

**సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి.**

**ఎస్పీ పరితోష్ పంకజ్**





**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 02 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. సైబర్ జాగృకత దివస్ సందర్భంగా సదాశివపేట పట్టణంలోని హర్ష బ్యాంకెట్ హాల్‌లో బుధవారం సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సైబర్ జాగృకత దివస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ షాపింగ్, పెట్టుబడుల పేరుతో జరిగే మోసాలపై ప్రజలు ప్రత్యేకంగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**డిజిటల్ చెల్లింపుల్లో జాగ్రత్త**

తెలియని వ్యక్తులు పంపే అనుమానాస్పద లింకులను తెరవవద్దని, ఓటీపీ, పిన్, సీవీవీ, పాస్‌వర్డ్ వంటి రహస్య సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని ఎస్పీ సూచించారు. బ్యాంకు అధికారులు, పోలీసుల పేరుతో ఫోన్ చేసే వ్యక్తులను నమ్మి వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ వివరాలు ఇవ్వకూడదన్నారు. నగదు బదిలీ చేసే సమయంలో సరైన వ్యక్తి లేదా ఖాతాకే డబ్బు వెళ్తుందో నిర్ధారించుకోవాలని సూచించారు.

**ఆన్‌లైన్ షాపింగ్‌పై అప్రమత్తత**

భారీ తగ్గింపులు, ఆకర్షణీయమైన ఆఫర్ల పేరుతో నకిలీ వెబ్‌సైట్లు, సామాజిక మాధ్యమ ఖాతాల ద్వారా మోసాలు జరిగే అవకాశం ఉందన్నారు. గుర్తుతెలియని వెబ్‌సైట్లు లేదా వ్యక్తులకు ముందస్తుగా నగదు చెల్లించకుండా, విశ్వసనీయమైన వేదికలను మాత్రమే ఉపయోగించాలని సూచించారు.

**పెట్టుబడుల పేరుతో మోసాలు**

తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే ఆన్‌లైన్ పెట్టుబడులు, ట్రేడింగ్, క్రిప్టో, షేర్ మార్కెట్ పేరుతో వచ్చే అనుమానాస్పద ఆఫర్లను నమ్మవద్దని ఎస్పీ సూచించారు. పెట్టుబడి పెట్టించే వ్యక్తులు, సంస్థల వివరాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

**గణేష్ మండపాల వద్ద అవగాహన**

గణేష్ చతుర్థి ఉత్సవాల నేపథ్యంలో గణేష్ మండపాల వద్ద సైబర్ నేరాలపై అవగాహన పోస్టర్లు ఏర్పాటు చేసి భక్తులు, ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలిపారు. శాంతి కమిటీ, సమన్వయ సమావేశాలను కూడా సైబర్ అవగాహన కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణలో పోలీసులతో పాటు ప్రజల అప్రమత్తత కూడా కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. చిన్న నిర్లక్ష్యం పెద్ద నష్టానికి దారితీసే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డి4సి డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, సదాశివపేట ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి, సైబర్ సెల్ సిబ్బంది, సదాశివపేట పట్టణానికి చెందిన సుమారు 350 మంది వ్యాపారవేత్తలు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మోసపూరిత హామీలపై బీఆర్ఎస్ సమరభేరి

**ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వం**

**ఓల్డ్ బోయిన్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో భారీ నిరసన సభ**

**దమ్ముంటే అభివృద్ధిపై చర్చకు రావాలని మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ సవాల్**

ఓల్డ్ బోయినపల్లి (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి, సెప్టెంబర్ 02):
ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని నిరసిస్తూ ఓల్డ్ బోయిన్‌పల్లిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం మరియు బహిరంగ సభ నిర్వహించారు. స్థానిక భాగ్యశ్రీ గార్డెన్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరుకాగా, మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ పాల్గొని మాట్లాడారు.

కేసీఆర్ హయాంలోనే సంక్షేమం –అభివృద్ధి:

ఈ సందర్భంగా ముద్దం నర్సింహ యాదవ్ మాట్లాడుతూ.. 2009 నుండి బోయిన్‌పల్లిలో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలిసి నిరంతరం కృషి చేశామని గుర్తుచేశారు. 2014 నుండి 2023 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ ఆడబిడ్డలకు పెద్దన్నలా నిలిచి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అందించారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణను సంక్షేమంలో ముందంజలో నిలిపిన ఘనత బీఆర్ఎస్‌దేనని స్పష్టం చేశారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

ప్రజలను మాయమాటలతో మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు నేడు హామీలను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. “ఎమ్మెల్యే కృష్ణారావు గురించి మాట్లాడే ముందు ప్రతిపక్ష నాయకులు ఒకసారి ఆలోచించుకోవాలి. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పని చేసే నాయకుడు కాబట్టే ప్రజలు ఆయనను వరుసగా మూడుసార్లు గెలిపించారు. దమ్ము, ధైర్యం ఉంటే ప్రజల్లోకి వచ్చి ఎవరు అభివృద్ధి చేశారో, ఎవరు చేయలేదో తేల్చుకుందాం” అని ఆయన సవాల్ విసిరారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే ఏ స్థానం నుండి పోటీ చేసినా ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఘనంగా హాజరైన పార్టీ శ్రేణులు:

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు నరేందర్ గౌడ్, సయ్యద్ ఇజాజ్, ఇర్ఫాన్, హరినాథ్, బలవంత్ రెడ్డి, కర్రె జంగయ్య, మక్కల నర్సింగ్ రావు, గడ్డం నర్సింగ్ రావు, ఖదీర్, లలిత గౌడ్, అనురాధ, రాజేశ్వరి, దుర్గ, హఫీజా సరోజ, ఉదయరాణిలతో పాటు సీనియర్ నాయకులు, మహిళా కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ముద్దం నర్సింహ యాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





# బీజేపీ గుండా రాజకీయాలకు పాల్పడుతోంది

## క్యాంప్ ఆఫీస్‌పై దాడి దుర్మార్గం

## ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై బీజేపీ నాయకుల దాడిని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. క్యాంప్ ఆఫీస్‌లో మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, టీపీసీసీ సభ్యులు తంగళ్లపల్లి రవికుమార్, పాలకుర్తి అబ్జర్వర్ పోత్నాక్ ప్రమోద్ కుమార్ తో కలిసి మీడియాతో మాట్లాడుతూ... క్యాంప్ ఆఫీస్‌పై దాడి ప్రజాస్వామ్యంపై దాడే, ఇది హేయమైన చర్య అని అన్నారు. ఢిల్లీ నుంచి అమిత్ షా డైరెక్షన్‌లో బండి సంజయ్ గుండా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, సీనియర్, మండల కాంగ్రెస్, మైనార్టీ, యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేజీబీవీలో వేళకు అందని భోజనం.. విద్యార్థినుల ఆకలి కేకలు!


**ఉదయం 11 గంటలకు అల్పాహారం..**

**మధ్యాహ్నం 3 గంటలకు భోజనం.**

**అర్ధాకలితో తరగతులకు హాజరవుతున్నారని తల్లిదండ్రుల ఆవేదన**




**న్యాల్కల్, సెప్టెంబర్ 02 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
న్యాల్కల్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినులకు ఆహారం అందించే వేళలపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం అల్పాహారం 11 గంటలకు, మధ్యాహ్న భోజనం ఏకంగా 3 గంటలకు అందిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సరైన సమయంలో ఆహారం అందక విద్యార్థినులు ఆకలితో తరగతి గదుల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. వసతి పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులకు పౌష్టికాహారం, సమయానుకూలంగా భోజనం అందించాల్సి ఉండగా.. భోజన వేళల్లో జాప్యం జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందని వారు చెబుతున్నారు. “పిల్లలు ఆకలితో ఉంటే చదువుపై ఎలా దృష్టి పెడతారు?” అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థినుల ఆరోగ్యం, విద్యాభ్యాసాన్ని దృష్టిలో ఉంచుకుని అల్పాహారం, మధ్యాహ్న భోజనం నిర్ణీత సమయాల్లో అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. భోజనం అందించే వేళలపై అధికారులు స్పందించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.





# గురుకుల పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**విద్యార్థుల వసతి, భోజనం, మౌలిక సదుపాయాలపై పరిశీలన**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి మండలం అనంతారం గ్రామంలోని మహాత్మా జ్యోతిబా ఫూలే బీసీ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు.పాఠశాల ఆవరణ, తరగతి గదులు, విద్యార్థుల వసతి, భోజన ఏర్పాట్లు, పరిశుభ్రత తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి అనుకూలమైన వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలపై ఆయన దృష్టి సారించారు.విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పాఠశాల నిర్వహణకు సంబంధించిన అంశాలపై సిబ్బందితో కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు.

# శ్రీ విజయపురంలో పార్లమెంటరీ స్థాయీ సంఘం సమావేశం

**పట్టణాభివృద్ధి పథకాల అమలుపై ఎంపీ చామల సమీక్ష**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 02, సెంట్రల్ బ్యూరో :** అండమాన్, నికోబార్ దీవుల్లోని శ్రీ విజయపురంలో నిర్వహించిన పార్లమెంటరీ గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల స్థాయీ సంఘం సమావేశానికి ఎంపీ చామల హాజరయ్యారు.కమిటీ చైర్మన్ మాగుంట శ్రీనివాసులు రెడ్డి సమక్షంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన పట్టణ 2.0, ప్రధానమంత్రి స్వనిధి, అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌తో పాటు ఇతర పట్టణాభివృద్ధి కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు.కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ దినేష్ కపిలా, సౌత్ అండమాన్ డిప్యూటీ కమిషనర్ పూర్వా గార్గ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఆయా పథకాల అమలు, పురోగతి, ప్రభావంపై కమిటీ సభ్యులకు వివరించారు.పట్టణ ప్రాంతాల అభివృద్ధితో పాటు పేదలు, వీధి వ్యాపారులకు ప్రభుత్వ పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలపై సమావేశంలో చర్చ జరిగింది. పథకాల అమలును మరింత సమర్థవంతంగా చేపట్టే అంశంపై తోటి పార్లమెంటు సభ్యులు, అధికారులతో కలిసి నిర్మాణాత్మక చర్చలు జరిపినట్లు ఎంపీ చామల తెలిపారు.

# భూమికి పొంచి ఉన్న తీవ్ర ప్రమాదం.. ఐక్యరాజ్యసమితి సంచలన హెచ్చరిక!




న్యూయార్క్, సెప్టెంబర్ 02, హైదరాబాద్ పల్స్ న్యూస్: భూగోళంపై ఉష్ణోగ్రతలు ఊహించని రీతిలో పెరుగుతున్నాయని, రాబోయే కొద్ది సంవత్సరాల్లోనే భూమి సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల సెల్సియస్ పరిమితిని దాటేస్తుందని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (యుఎన్ఈపీ) తీవ్రంగా హెచ్చరించింది. పారిస్ ఒప్పందం లక్ష్యం దాటిపోతుండటంతో, ఉష్ణోగ్రతల పెంపుదల వ్యవధిని వీలైనంత తగ్గించడమే ఇప్పుడు మన ముందున్న ఏకైక మార్గమని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ స్పష్టం చేశారు.ఒకవేళ ఉష్ణోగ్రత పెరుగుదల 1.8 డిగ్రీలకు చేరుకుంటే తుపానులు, కరువులు తీవ్రతరం కావడం, ఆహార-తాగునీటి కొరత మరియు మంచు పర్వతాలు కరిగి సముద్ర మట్టాలు పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని అదుపు చేయాలంటే శిలాజ ఇంధనాల (బొగ్గు, చమురు, గ్యాస్) వాడకానికి తక్షణమే ముగింపు పలకాలని, విస్తారంగా అడవులను పెంచడంతో పాటు కార్బన్ ఉద్గారాలను తగ్గించాలని నివేదిక పేర్కొంది. పర్యావరణ పరిరక్షణతో పాటు మానవాళి మనుగడ కోసం అభివృద్ధి చెందిన దేశాలు తక్షణమే నిధులు కేటాయించి ముందుండి పోరాడాలని ఐరాస పిలుపునిచ్చింది.

# పేదల గుండెల్లో చిరస్థాయిగా మహానేత వైఎస్సార్

**వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి, మాజీ ముఖ్యమంత్రి, మహానేత స్వర్గీయ డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా భువనగిరి పట్టణంలోని కిసాన్ నగర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... మహానేత వైఎస్సార్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్, 108 వంటి సంక్షేమ పథకాలు నేటికీ దేశానికే ఆదర్శంగా నిలిచాయని గుర్తుచేసుకున్నారు.అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ..."మహానేత వైఎస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు పొందని ఇల్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లేదు. రైతు సంక్షేమం కోసం, పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం, ఉచిత వైద్యం కోసం ఆయన పడిన తపన అమూల్యం. వైఎస్సార్ చూపిన ప్రజాపాలన మార్గమే మనందరికీ దిశా నిర్దేశం. ఆయన ఆశయ సాధనకు నిరంతరం కృషి చేయడమే మనం ఆయనకర్పించే నిజమైన నివాళి" అని పేర్కొన్నారు. భువనగిరి పట్టణ అభివృద్ధిలో కూడా వైఎస్సార్ స్ఫూర్తితోనే ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమానికి పాటుపడతామని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు తంగళ్లపల్లి రవికుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు



కుక్కదుగు సోమయ్య, బర్రె జహంగీర్, పిట్టల బాలరాజ్,లాల్ రాజ్, కూర శివకుమార్, నజీర్ భాయ్, ఎండీ రఫియుద్దీన్, పొకల యాదగిరి, సిరికొండ యాదగిరిలతో పాటు భువనగిరి మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, టౌన్, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏఐకెఎంఎస్ రాష్ట్ర 9వ మహాసభలను జయప్రదం చేయండి

**ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య, ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** అఖిల భారత రైతు.కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) తెలంగాణ రాష్ట్ర 9వ మహాసభలు సెప్టెంబర్ 8,9 తేదీలలో మంచిర్యాలలో జరుగనున్నాయని రైతు.కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య, ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్ కోరారు. బుధవారం ఆలేరు ఎంపీడీఓ ఆవరణలో మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడివయ్య, బేజాడి కుమార్ లు మాట్లాడుతూ... రాష్ట్ర మహాసభలో కేంద్ర, రాష్ట్ర పాలకులు అనుసరిస్తున్న రైతు.కూలీలు,కౌలు రైతు వ్యతిరేక చట్టాలను,విధానాలపై రైతాంగం పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక, అప్పులు చేసి ఆర్థికంగా దివాలు తీస్తున్న ,ఇబ్బంది పాలవుతున్న పరిస్థితులపై వివరమైన చర్చలు జరుగుతాయని,భవిష్యత్ కా ా ్య చ ే ం ే ణ న ు రూపొందించుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై బలమైన రైతాంగ ఉద్యమాన్ని నిర్మించుటకు ఈ మహాభలలో నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని, రైతు. కూలీలు, ప్రజలు మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు మామిడాల సోమయ్య, ఉపాధ్యక్షులు మామిడాల బాల మల్లేష్, జిల్లా నాయకులు చిర బోయిన కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



# తల్లి, చెల్లెలిపై హత్యాయత్నం: జహీరాబాద్‌లో యువకుడి అరెస్ట్

**చెరకు నరికే కత్తితో కిరాతకంగా దాడి చేసిన సవతి కొడుకు.**

**ఆస్తి వివాదాలు, గొడవలే దాడికి కారణం.**

**ఎస్సై లవకుమార్**

జహీరాబాద్ (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి, సెప్టెంబర్ 02): ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాల నేపథ్యంలో సవతి తల్లి, చెల్లెలిపై కత్తితో కిరాతకంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జహీరాబాద్ టౌన్ ఎస్సై లవకుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు పూర్వాపరాలను వెల్లడించారు.

ఘటన నేపథ్యం:

పోలీసుల కథనం ప్రకారం.. జహీరాబాద్ పట్టణంలోని భారత్ నగర్‌కు చెందిన మహమ్మద్ నిజాముద్దీన్‌కు ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్య ఫరీనా బేగం బసవేశ్వర కాలనీలో నివాసముంటుండగా ఆమెకు నలుగురు పిల్లలు ఉన్నారు. రెండో భార్య షబానా బేగం భారత్ నగర్‌లో కుమార్తె హర్షనాజ్‌తో కలిసి నివసిస్తోంది. గత కొన్ని రోజులుగా నిజాముద్దీన్ ఆస్తి విషయంలో ఇద్దరు భార్యల కుటుంబాల మధ్య వివాదం నడుస్తోంది.

ఈ క్రమంలో మొదటి భార్య కుమారుడు ఇమ్రాన్.. జహీరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న సవతి చెల్లెలు హర్షనాజ్‌తో కళాశాల వద్ద గొడవపడి, ఇతరులతో ఎందుకు మాట్లాడుతున్నావంటూ అందరి ముందు నిలదీశాడు. ఈ విషయాన్ని హర్షనాజ్ ఇంటికి వటట్లి తల్లి షబానా బేగానికి తెలిపింది.

కత్తితో కిరాతక దాడి:

మంగళవారం రోజున ఇమ్రాన్ తన స్నేహితుడు హాజీతో కలిసి భారత్ నగర్‌లోని షబానా బేగం ఇంటికి వెళ్లి గొడవకు దిగాడు. ఈ క్రమంలో ఇమ్రాన్‌ను వారు వెంబడించగా అతడు కిందపడిపోయాడు. దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన ఇమ్రాన్, ఇంటి ఎదురుగా ఉన్న స్క్రాప్ షాప్ నుంచి చెరకు నరికే కత్తిని తీసుకువచ్చి షబానా బేగంను చంపేసే ఉద్దేశంతో తల, వీపుపై తీవ్రంగా నరికాడు. తల్లిని కాపాడేందుకు వచ్చిన చెల్లెలు హర్షనాజ్ తలపై కూడా కత్తితో దాడి చేయడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి.

అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు:

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, తీవ్రంగా గాయపడిన షబానా బేగం, హర్షనాజ్‌లను చికిత్స నిమిత్తం జహీరాబాద్‌లోని ప్రముఖ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడు ఇమ్రాన్‌ను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై లవకుమార్ వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్సై-2 పుష్పలత రెడ్డి పాల్గొన్నారు.



# భారత్, చైనా, అమెరికాపై వాతావరణ నష్టపరిహారం డిమాండ్‌కు నేపాల్ సిద్ధం

**భారీ వరదలకు అధిక ఉద్గారాలే కారణమంటూ ఆరోపణలు**

ఖాట్మండు, హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 02: నేపాల్‌లో ఇటీవల సంభవించిన భారీ వరదలు తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. ఈ విపత్తుకు ప్రపంచంలో అత్యధికంగా గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేస్తున్న దేశాల పాత్ర ఉందంటూ నేపాల్ కొత్త డిమాండ్‌ను ముందుకు తెచ్చింది.చైనా, భారత్, అమెరికా వంటి అధిక ఉద్గార దేశాల నుంచి వాతావరణ మార్పుల ప్రభావానికి సంబంధించిన నష్టపరిహారం కోరేందుకు నేపాల్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. వరదల కారణంగా ఇప్పటివరకు కనీసం 1,127 మంది మృతి చెందగా, సుమారు 3,900 మంది గల్లంతైనట్లు పేర్కొంటున్నారు.వాతావరణ మార్పుల వల్ల తీవ్ర ప్రభావాలను ఎదుర్కొంటున్న బలహీన దేశాలకు సహాయం చేయాల్సిన బాధ్యత అధిక ఉద్గారాలు విడుదల చేసే దేశాలపై ఉందని నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ పేర్కొన్నట్లు సమాచారం.వరదల వల్ల జరిగిన నష్టానికి తక్షణ ఆర్థిక సహాయం అందించాలంటూ ఐక్యరాజ్యసమితి మద్దతుతో పనిచేస్తున్న నష్టం, నష్టపరిహార నిధిని నేపాల్ సంప్రదించినట్లు తెలుస్తోంది. దీంతో పాటు వాతావరణ న్యాయం కోసం అంతర్జాతీయ వేదికలపై తమ డిమాండ్‌ను మరింత బలంగా వినిపించేందుకు నేపాల్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.త్వరలో జరిగే ఐక్యరాజ్యసమితి



సర్వసభ్య సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించే అవకాశాలున్నట్లు సమాచారం. భారీ వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న నేపాల్ పునరావాసం, పునర్నిర్మాణానికి అంతర్జాతీయ సహకారం అవసరమని అధికారులు భావిస్తున్నారు.

# జూటా పాలనకు కేరాఫ్ రేవంత్ సర్కారు: ఎమ్మెల్యే జీఎంఆర్

**420 హామీల అమలులో కాంగ్రెస్ విఫలం..**

**22ఏ భూముల సమస్యపై అసెంబ్లీలో పోరాడతాం.**





**పటాన్‌చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 02:**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా హామీల అమలులో విఫలమైందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ప్రజా వ్యతిరేకంగా కొనసాగుతోందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన వారం రోజుల పోరుబాట కార్యక్రమంలో భాగంగా పటాన్‌చెరు పట్టణంలో తొలి రోజు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృత్వంలో ఎంజీ రోడ్డు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ, 420 హామీలతో కూడిన ఫ్లెక్సీల ప్రదర్శన చేపట్టారు. అనంతరం ప్రజలకు బకాయి హామీల కార్డులను పంపిణీ చేశారు.

**420 హామీలు అమలు చేయాలి**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ పిలుపు మేరకు పటాన్‌చెరు నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

**22ఏ భూముల సమస్యపై అసెంబ్లీలో పోరాటం**

22ఏ నిషేధిత జాబితాలో వివాదాలు లేని భూములను కూడా చేర్చడం వల్ల ప్రజలు తమ ఆస్తులను విక్రయించలేని, కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడుతోందని జీఎంఆర్ ఆరోపించారు. 22ఏ భూముల సమస్యను అసెంబ్లీలో ప్రధాన అంశంగా లేవనెత్తి, బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని స్పష్టం చేశారు.

**సంక్షేమ పథకాలు నిర్వీర్యం చేశారన్న ఆరోపణ**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ తదితర సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఎమ్మెల్యే ఆరోపించారు. పేదలు, మహిళలు, విద్యార్థులు, రైతులు, సామాన్య ప్రజలకు అందాల్సిన సంక్షేమ ప్రయోజనాలు సక్రమంగా అందడం లేదని విమర్శించారు.

**ప్రతి గ్రామం, వార్డులో పోరుబాట**

పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, వార్డు, డివిజన్‌లో పోరుబాట కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును వివరించాలని సూచించారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైఎస్సార్ సేవలను ప్రజలు ఎప్పటికీ మరువరు

**వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి చేయాలి: పర్స శ్యామ్ రావు**



రామచంద్రపురం, హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 02:
మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని తెల్లాపూర్ డివిజన్ 263లో స్థానిక కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సంగారెడ్డి డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్స శ్యామ్ రావు ముఖ్య అతిథిగా హాజరై వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పర్స శ్యామ్ రావు మాట్లాడుతూ పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుపేద కుటుంబాల సంక్షేమం కోసం వైఎస్సార్ విశేష కృషి చేశారని అన్నారు. ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర సంక్షేమ కార్యక్రమాల ద్వారా లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచారని గుర్తు చేశారు.వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని అన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చిన వైఎస్సార్ సేవలను ప్రజలు ఎప్పటికీ మరువరని పేర్కొన్నారు.కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ భరత్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు అరుణ్ గౌడ్, రవి, యాదగల్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు రాజు, మంగలి మహేష్, ప్రశాంత్, బలరాం, కొల్లూర్ శ్రీను, హరీష్ గౌడ్, విక్రమ్, ప్రవీణ్ తదితరులు పాల్గొని వైఎస్సార్‌కు నివాళులర్పించారు.

# వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**కొంపల్లి డివిజన్ అధ్యక్షుడు ఆదిరెడ్డి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం**



**కొంపల్లి, సెప్టెంబర్ 02 (హైదరాబాద్ పల్స్ న్యూస్):**
మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా కొంపల్లి డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. డివిజన్ అధ్యక్షుడు ఆదిరెడ్డి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కొంపల్లి సెంటర్ పార్క్‌లోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రజా సంక్షేమానికి విశేష కృషి చేశారని అన్నారు. రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పలు సంక్షేమ పథకాలను అమలు చేసిన ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు.కార్యక్రమంలో లేబర్ సెల్ అధ్యక్షుడు కందాడి సుదర్శన్‌రెడ్డి, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నారం గోపాల్‌రెడ్డి, లేబర్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్కల ఉపేందర్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు షేక్ ఇబ్రహీం, గోపాల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ఆంజనేయులు ముదిరాజ్, పులకంటి వెంకట్‌రెడ్డి, ఎడమ రాజశేఖర్‌రెడ్డి, తీగుల నరేంద్రగౌడ్, లక్ష్మీపతిరాజు, సందీప్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు లలితమ్మతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలం

**డోర్నకల్‌లో బీఆర్ఎస్ నిరసన.. సీఎం రాజీనామాకు డీఎస్ రెడ్యానాయక్ డిమాండ్**

**హైదరాబాద్ పల్స్, అక్టోబర్ 02, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :**
ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ఆరోపించారు. బుధవారం డోర్నకల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ రూపొందించిన 'బాకీ కార్డులను' స్థానిక ప్రజలకు అందజేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్ రెడ్యానాయక్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు అనేక హామీలతో ప్రజల మద్దతు పొందిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలును విస్మరించిందని విమర్శించారు. రైతులు, మహిళలు, యువత, పేదలు సహా వివిధ వర్గాలకు ఇచ్చిన హామీల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సుదీర్ఘ పాలనలో ప్రజలకు అందిన ప్రయోజనం ఏమిటో స్పష్టం చేయాలని ప్రశ్నించారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నైతిక బాధ్యత వహించి పదవికి రాజీనామా చేయాలని డీఎస్ రెడ్యానాయక్ డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిలిచి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. హామీల అమలుపై ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు విద్యాసాగర్, సొసైటీ చైర్మన్ చే రెడ్డి బిక్షం రెడ్డి, చిలుకోడు గ్రామ సర్పంచ్ రాయల వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు పాండు నాయక్, కాడెం బాబు, చంటి, గౌస్, మన్మధరావు, కొత్త రాంబాబు, తేజావత్ బాషా, చిలుమూల రఘు, వేమూరి వెంకటేశ్వర్లు, పోగుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



# ఉయ్యాలవాడలో ఓటరు సమగ్ర సర్వేకు విశేష స్పందన

**తప్పులున్న ఓటర్ల వివరాల సవరణకు ప్రత్యేక కార్యక్రమం**



**హైదరాబాద్ పల్స్, సెప్టెంబర్ 02, డోర్నకల్ :**
డోర్నకల్ మండలం ఉయ్యాలవాడ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఓటరు సమగ్ర సర్వేలో భాగంగా తప్పులుగా నమోదైన ఓటర్ల వివరాలను సరిచేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డులను ఆధారంగా తీసుకుని ఓటర్ల వివరాలను పరిశీలించి, అవసరమైన సవరణలను బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ల సహకారంతో చేపట్టారు. గ్రామ సర్పంచ్ శ్యాం బాబు, ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పరిశీలించారు. ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తాళ్లూరి హనుమ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని అవసరమైన సవరణలు చేయించుకున్నారు. ప్రజల భాగస్వామ్యంతో ఓటరు సమగ్ర సర్వే కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.

# కాంగ్రెస్ వైఫల్యాలపై బిఆర్ఎస్ ఉక్కుపాదం..

**జహీరాబాద్‌లో భారీ ర్యాలీ, రాస్తారోకో**



జహీరాబాద్, సెప్టెంబర్ 02, హైదరాబాద్ పల్స్ న్యూస్:
ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తీవ్రంగా మోసం చేస్తోందని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జహీరాబాద్ పట్టణంలో భారీ ర్యాలీ, అనంతరం ముఖ్య రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ... ఎన్నికల ప్రచారంలో భాగంగా 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, పాలన చేపట్టిన తర్వాత ఆ హామీల అమలును పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎం. శివకుమార్, మాజీ మార్కెట్ చైర్మన్ జి. గుండప్ప, పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, నర్సింలు, సంజీవరెడ్డి, వెంకటేశం, తంజీమ్, నామకిరణ్, యాకుబ్, ఫయాజ్, వివిధ గ్రామాల సర్పంచ్ లు, పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, యువకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కొంపల్లిలో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**కొంపల్లి, సెప్టెంబర్ 02, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ 55వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కొంపల్లిలో ఆయన అభిమానుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కొంపల్లి మాజీ సర్పంచ్, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జెమ్మి దేవేందర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కళ్యాణ్ ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కావలి నవీన్ ముదిరాజ్, షేక్ ఖదీర్తో పాటు పవన్ కళ్యాణ్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు. అభిమానుల నినాదాలతో కొంపల్లిలో సందడి నెలకొంది.

# ఆపరేషన్ సింధూర్ కమాండర్ కు అయోధ్య బాధ్యత - ఆలయ ట్రస్ట్ కీలక నిర్ణయం..!

**అయోధ్య రామాలయ ట్రస్ట్ తొలి సీఈవోగా ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా**

**ఆపరేషన్ సింధూర్ సమయంలో కీలక బాధ్యతలు నిర్వహించిన మాజీ వైమానిక అధికారి**



హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 02, సెంట్రల్ డెస్క్:
ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామాలయ నిర్వహణకు సంబంధించి శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ట్రస్ట్ తొలి ప్రధాన కార్యనిర్వాహక అధికారిగా రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రాను నియమించినట్లు వెల్లడైంది. భారత వైమానిక దళంలో సుదీర్ఘకాలం సేవలందించిన జితేంద్ర మిశ్రా ఫైటర్ పైలట్‌గా, ఫైటర్ కంబాట్ లీడర్‌గా, టెస్ట్ పైలట్‌గా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. వెస్టన్ ఎయిర్ కమాండ్‌కు నాయకత్వం వహించిన ఆయన, ఆపరేషన్ సింధూర్ సమయంలో కూడా కీలక బాధ్యతల్లో ఉన్నట్లు సమాచారం. ట్రస్ట్ నిర్వహణను మరింత పటిష్ఠం చేయడం, పరిపాలనా వ్యవస్థలో సమర్థవంతమైన నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వడం లక్ష్యంగా ఈ నియామకం చేపట్టినట్లు తెలుస్తోంది. కొత్త బృందంలో కోశాధికారి, ట్రస్టీల స్థాయిలో కూడా పలు మార్పులు జరిగినట్లు సమాచారం. అయోధ్య రామాలయానికి దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు వస్తుండటంతో, ఆలయ పరిపాలన, భద్రత, విరాళాల నిర్వహణ, భక్తులకు సౌకర్యాల కల్పన వంటి అంశాల్లో సీఈవోగా జితేంద్ర మిశ్రా కీలక పాత్ర పోషించనున్నారు.

## జర్నలిస్టు జహంగీర్ బాబు మాతృమూర్తి అంజమ్మ మృతి.. పరామర్శించిన ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి



వర్గల్, సెప్టెంబర్ 02 (హైదరాబాద్ పల్స్ న్యూస్):
జర్నలిస్టు జహంగీర్ బాబు మాతృమూర్తి అంజమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి వర్గల్ లోని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన, అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యాన్ని కల్పించారు. అంజమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, జహంగీర్ బాబు కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు అన్ని వేళలా అండగా ఉంటామని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి డాక్టర్ మల్లేశం, లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ కొలిచెలిమి స్వామి, బయ్యారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, దిలాల్ పూర్ మాజీ సర్పంచ్ దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాము కాటుతో వ్యక్తి మృతి.!

గౌరారం, సెప్టెంబర్ 02 (హైదరాబాద్ పల్స్ న్యూస్):
పాము కాటుకు గురై చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గౌరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గౌరారం ఏఎస్ఐ పోచగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం...గిర్మాపూర్ గ్రామానికి చెందిన సైల అశోక్ (45) ఈ నెల 26న ఉదయం గ్రామంలో కూలీ పనులు చేస్తుండగా గుర్తుతెలియని పాము కాటు వేసింది. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడే ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రజ్ఞాపూర్‌లోని ఆదితి ఆసుపత్రికి తరలించారు. అక్కడ మూడు రోజుల పాటు చికిత్స పొందినప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడంతో, వైద్యుల సూచన మేరకు ఈ నెల 29న సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. గాంధీ ఆసుపత్రిలో తీవ్ర చికిత్స పొందుతూ సెప్టెంబర్ 1న ఉదయం పరిస్థితి విషమించి అశోక్ మృతి చెందాడు. మృతుడి సోదరుడు సైల కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గౌరారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వైద్య రంగంలో మరో ముందడుగు

**సైంటిఫిక్ ఆర్థో న్యూరో సెంటర్‌ను ప్రారంభించిన ఎంపీ ఈటల రాజేందర్**

దూలపల్లి, సెప్టెంబర్ 02 (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):
దూలపల్లి డివిజన్ పరిధిలో వైద్య రంగంలో మరో ముందడుగు పడింది. ఆర్థోపెడిక్, న్యూరో సంబంధిత సమస్యలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన సైంటిఫిక్ ఆర్థో న్యూరో సెంటర్‌ను మేడ్చల్--మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ బుధవారం ప్రారంభించారు. అనంతరం డాక్టర్ అశోక్ చంద్రు రాజేష్ ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. దూలపల్లి, కొంపల్లి పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. ఆర్థోపెడిక్, న్యూరో సమస్యలతో బాధపడుతున్న వారికి సకాలంలో మెరుగైన వైద్యం అందించడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఆధునిక వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని నిర్వాహకులకు సూచించారుకొత్తగా ప్రారంభమైన ఈ కేంద్రం అందుబాటులోకి రావడంతో వైద్య సేవల కోసం పరిసర ప్రాంతాల ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు కొంతవరకు తగ్గనున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, కొంపల్లి బీజేపీ అధ్యక్షుడు సతీష్ సాగర్, మహేందర్, అశోక్, దుర్గ, నరసింహ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# మంతపురిలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మార్నింగ్ వాక్.. ప్రజల సమస్యలపై ఆరా

**ఇందిరమ్మ ఇళ్ల పురోగతి పరిశీలన.. మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి కృషి**

**బాల్య వివాహాలు అరికట్టాలి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**





హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మంతపురి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే, ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు సంబంధించిన బిల్లులు సక్రమంగా మంజూరయ్యాయా? పెండింగ్‌లో ఏమైనా ఉన్నాయా? అనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంతపురి గ్రామంలో గతంలో ప్రజలకు ఇబ్బందిగా ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్ తొలగింపు సమస్య పరిష్కారం కావడంతో గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమస్య పరిష్కారంతో ప్రజలకు, ముఖ్యంగా ఇళ్ల మధ్యలో విద్యుత్ లైన్ల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోయాయని సంతోషం వ్యక్తం చేశారు. తదనంతరం గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ తదితర మౌలిక వసతుల సమస్యలను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. ఇంకా ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జంగాల కాలనీలో భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలపై కూడా ఎమ్మెల్యే అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండకముందే బాలికలకు వివాహాలు చేయడం చట్టవిరుద్ధమని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించాలని సూచించారు. ఆడపిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు జరిపించాలని ప్రజలకు సూచించారు. బాలికలకు మంచి విద్య, భద్రత, భవిష్యత్ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, సమాజంపై ఉందన్నారు. మార్నింగ్ వాక్ సందర్భంగా గ్రామ ప్రజలు ఎమ్మెల్యేను కలిసి డ్రైనేజీ, సీసీ రోడ్లు, విద్యుత్ తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను ఓపికగా విన్న ఎమ్మెల్యే, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా మార్నింగ్ వాక్‌లను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

# బీపీ మాత్రలు మానేస్తే ప్రమాదమే: వైద్యుల తీవ్ర హెచ్చరిక



**వైద్యుల సలహా లేకుండా మందులు ఆపడం ప్రాణాలకే ప్రమాదం.**

**ఒక్కరోజు మాత్ర వేసుకోకపోయినా రక్తపోటు అదుపు తప్పుతుంది.**

**డాక్టర్ శ్రీకాంత్ మిర్యాల**

హైదరాబాద్ (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి, సెప్టెంబర్ 02):
రక్తపోటు (హై బీపీ) సమస్యతో బాధపడుతున్న వారు వైద్యుల సూచన లేకుండా మందులను మధ్యలోనే ఆపేయడం లేదా మోతాదు తగ్గించడం అత్యంత ప్రమాదకరమని ప్రముఖ వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఒక్కరోజు మాత్ర వేసుకోకపోతే ఏమీ కాదనే ధోరణి ఆరోగ్యానికి తీవ్ర ముప్పు తెచ్చిపెడుతుందని స్పష్టం చేస్తున్నారు.

క్రమం తప్పకుండా మందులు వాడాల్సిందే:
డాక్టర్ శ్రీకాంత్ మిర్యాల తెలిపిన వివరాల ప్రకారం.. రక్తపోటును నియంత్రించే మందులు నిర్దిష్ట కాలవ్యవధిలో శరీరంలో సమర్థవంతంగా పనిచేస్తాయి. ప్రతిరోజూ నిర్ణీత సమయానికి మందులు వేసుకోవడం అత్యంత ఆవశ్యకం. మందులను క్రమం తప్పకుండా వాడకపోవడం వల్ల రక్తపోటు అకస్మాత్తుగా పెరిగి ప్రమాదకర పరిస్థితులకు దారితీసే అవకాశం ఉంటుంది.

లక్షణాలు కనిపించకపోవచ్చు.. అయినా అప్రమత్తంగా ఉండాలి:
చాలామందిలో బీపీ ఎక్కువగా ఉన్నప్పటికీ వెంటనే ఎటువంటి బాహ్య లక్షణాలు కనిపించవు. దీనివల్ల బీపీ అదుపులోనే ఉందనే అపోహతో చాలామంది మందులను సొంతంగా నిలిపివేస్తుంటారు. కానీ ఇది ఏమాత్రం సరైన పద్ధతి కాదని వైద్యులు పేర్కొంటున్నారు.

దుష్ప్రభావాలు ఉంటే వైద్యుడిని సంప్రదించాలి:
బీపీ మందులు వాడుతున్నప్పుడు ఏదైనా ఇబ్బంది లేదా సైడ్ ఎఫెక్ట్స్ కనిపిస్తే సొంత నిర్ణయాలతో మందులు ఆపకుండా, వెంటనే చికిత్స అందిస్తున్న వైద్యుడిని సంప్రదించాలి. రోగి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా మందుల మోతాదును మార్చడం లేదా ప్రత్యామ్నాయ చికిత్స అందించడం వైద్యులు చేస్తారని వివరించారు.

క్రమంతప్పక పరీక్షలు అవసరం:
ఇంట్లోనే క్రమం తప్పకుండా రక్తపోటును పరీక్షించుకోవడం, బీపీ రీడింగ్స్‌లో మార్పులు ఉంటే వెంటనే వైద్యుల దృష్టికి తీసుకెళ్లడం శ్రేయస్కరం. ఆహార నియమాలు, జీవనశైలిలో మార్పులతో పాటు నిర్ణీత సమయానికి మందులు తీసుకోవడమే బీపీని అదుపులో ఉంచే ఏకైక మార్గమని డాక్టర్ శ్రీకాంత్ మిర్యాల స్పష్టం చేశారు.

హైదరాబాద్ పల్స్

# వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్సార్ - ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**

హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మంతపురి గ్రామంలో దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమాన్నీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హాజరై వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన మహానేత అని అన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకుని, వారి సమస్యలకు పరిష్కారం చూపేందుకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు.ప్రత్యేకంగా రైతుల సంక్షేమానికి ఉచిత



విద్యుత్, రైతులకు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలిచారని తెలిపారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, విద్య, సాగునీరు, గృహ నిర్మాణం వంటి రంగాల్లో అనేక కార్యక్రమాలను అమలు చేసి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చారని అన్నారు.డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నేటికీ ప్రజల మనసుల్లో నిలిచిపోయాయని బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. ముఖ్యంగా పేదవాడి ఇంటికి ప్రభుత్వం చేరువ కావాలనే ఆలోచనతో ఆయన పనిచేశారని, అందుకే ఆయనను ప్రజలు ఆప్యాయంగా "మహానేత"గా గుర్తు చేసుకుంటున్నారని అన్నారు.వైఎస్సార్ ఆశయాలు, ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, పేదల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని బీర్ల ఐలయ్య తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలను స్మరించుకోవడం మాత్రమే కాకుండా, ఆయన చూపిన ప్రజాసేవా మార్గంలో నడుస్తూ పేదలు, రైతులు, మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని బీర్ల ఐలయ్య అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, అభిమానులు తదితరులు పాల్గొని వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఘన నివాళులర్పించారు.

# కేసీఆర్ రాజీనామా చేస్తే తట్టుకునే శక్తి మీకుందా?: సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ ఘాటు సవాల్

**రాజీనామాలు కేసీఆర్‌కు కొత్త కాదు.. అప్పట్లో ఢిల్లీనే వణికింది: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**

**కాంగ్రెస్ అధిష్ఠానానికే లేని శక్తి నీకుందా అని సీఎం రేవంత్‌ను ఉద్దేశించి ప్రశ్నించిన కేటీఆర్**

**రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు.. అధికార పార్టీ నేతల దౌర్జన్యాలపై చర్యలేవి?**

హైదరాబాద్ (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి, సెప్టెంబర్ 02):

ప్రతిపక్ష నేత పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అత్యంత ఘాటుగా స్పందించారు. కేసీఆర్‌కు రాజీనామాలు చేయడం కొత్తేమీ కాదని, గతంలో ఆయన చేసిన రాజీనామాలతోనే ఢిల్లీ రాజకీయం వణికిపోయిందని గుర్తుచేశారు. కేసీఆర్ కనుక మరోసారి రాజీనామా చేస్తే ఆ పరిణామాలను ఎదుర్కొనే శక్తి కాంగ్రెస్ అధిష్ఠానానికే లేదని, మరి మీకున్నదా అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని



నిలదీశారు.

రాజీనామాలతోనే తెలంగాణ సాధన:

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో కేసీఆర్ చేసిన రాజీనామాల హిస్టరీని కేటీఆర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. కేసీఆర్ వేసిన రాజీనామా అస్త్రాలతోనే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి పెరిగిందని, చివరకు దిగివచ్చి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేత పదవి గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ నేతలకు లేదన్నారు.

శాంతిభద్రతలపై తీవ్ర విమర్శలు:

ఇదే సమయంలో రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రభుత్వాన్ని, పోలీసు వ్యవస్థను కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. అధికార పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులపై తీవ్రమైన ఆరోపణలు వచ్చినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. మంత్రుల కుమారులు దౌర్జన్యాలకు పాల్పడినా, ఎంపీల కుమారులపై తీవ్రమైన కేసులు ఉన్నా చట్ట ప్రకారం వ్యవహరించకుండా వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

చట్టం అందరికీ సమానంగా వర్తించాలి:

పోలీసులు అధికార పార్టీ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా, చట్టం అందరికీ సమానమనే సూత్రంతో పనిచేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రతిపక్షాలపై అనవసర విమర్శలు చేయడం మాని, రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మరియు శాంతిభద్రతల పరిరక్షణపై శ్రద్ధ వహించాలని హితవు పలికారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ నిరసన

**420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శన.. హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన నాయకులు**

హైదరాబాద్ పల్స్ న్యూస్ , సెప్టెంబర్ 02, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి ప్రతినిధి : ఆలేరు, కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తిచేసుకున్న నేపథ్యంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్



గొంగిడి సునిత మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఎన్నికల సమయంలో 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, అయితే ప్రభుత్వం 1000 రోజులు పూర్తిచేసుకున్నా హామీల అమలులో వైఫల్యం చెందిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు, పాలనా వైఫల్యాలను ప్రస్తావిస్తూ 420 అడుగుల ఫ్లెక్సీని ప్రదర్శించారు.ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డితో పాటు నియోజకవర్గంలోని వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సంగారెడ్డి లో అక్టోబర్ 07న దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర మహాసభలు.

**విజయవంతం చెయ్యాలని కాషాపోగు జాన్ పిలుపు.**

**దళిత జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఉద్యమం.**

**దళిత జర్నలిస్టుల ఫోరం సంగారెడ్డి జిల్లా కమిటీ ఎన్నిక.**

**అధ్యక్షుడిగా రామని అశోక్ ప్రధాన కార్యదర్శిగా నవీన్ కుమార్ ఎన్నిక**

**సంగారెడ్డి, హైదరాబాద్ పల్స్ న్యూస్, సెప్టెంబర్ 02:**

జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని దళిత జర్నలిస్టుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాషాపోగు జాన్ అన్నారు. దళిత జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, కౌంటర్ కేసులతో వేధింపులను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా దళిత జర్నలిస్టుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాషాపోగు జాన్, రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా రామని అశోక్, ప్రధాన కార్యదర్శిగా నవీన్ కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా దశరథ్, రాజేందర్, తలారి నర్సింలు, సంజీవ్,



జిల్లా అధ్యక్షులు రామని అశోక్.

అతిమెల్ పాఠశాలలో దళిత జర్నలిస్టు రాములుపై జరిగిన దాడిని నాయకులు ఖండించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, దాడికి గురైన



జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్.

హక్కులు, సంక్షేమం కోసం పనిచేస్తామని తెలిపారు. అవసరమైతే ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాలు చేపడతామని అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ.. దళిత జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం

మోహన్; కార్యదర్శులుగా ముక్కగల్ల యాదన్న, కందుకూరి క్రిష్ణ, రాహుల్ కుమార్, రాజు, గౌతమ్; కోశాధికారిగా సంపత్‌ను ఎన్నుకున్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వరిగుంతం శంకర్, దాసు, దానమ్మోళ్ల క్రిష్ణ, బమైసగళ్ల బుచ్చయ్య, సలహాదారులుగా ఎం. కిషన్ రావు, రాజు, కార్యవర్గ సభ్యులుగా మాణిక్యం, పోచయ్య, పరమేసుల క్రిష, రాములు నియమితులయ్యారు. మనూర్ మండలం

జర్నలిస్టులపై కౌంటర్ కేసులతో వేధింపులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దళిత జర్నలిస్టులకు అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షల ఆర్థిక సహాయం, ఇళ్ల స్థలాలు, ఉచిత బస్సు పాస్‌లు, జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. నూతన జిల్లా అధ్యక్షుడు రామని అశోక్ మాట్లాడుతూ.. జిల్లాలోని దళిత జర్నలిస్టులను సమన్వయం చేసుకుని వారి

పరిష్కరించాలని, జర్నలిస్టులపై దాడులు, వేధింపులు, కౌంటర్ కేసులకు అడ్డుకట్ట పడే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు రాపాక విజయరాజు, సీనియర్ జర్నలిస్టులు విలాస్, రాజు, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డిఫెన్స్ నుంచి అటాక్‌లోకి కొండా సురేఖ: రివర్స్ గేమ్‌తో కాంగ్రెస్ హైకమాండ్‌కు షాక్!

**సీఎం రేవంత్ రెడ్డి వైఖరినే ప్రశ్నిస్తూ ఢిల్లీ వేదికగా విమర్శల బాణాలు.**

**"చర్యలు తీసుకోవాలంటే ముందు సీఎంపైనే తీసుకోవాలి" అని ఘాటు వ్యాఖ్యలు.**

**బీసీ-సమాన న్యాయం కార్డ్‌తో వివాదానికి కొత్త రంగు పూసిన మంత్రి**




సెంట్రల్ డెస్క్ (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి, సెప్టెంబర్ 02):

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు మరోసారి తీవ్ర రూపం దాల్చింది. మంత్రి కొండా సురేఖపై అధిష్ఠానం క్రమశిక్షణ వేటు వేస్తుందనే ప్రచారం జోరుగా సాగుతున్న వేళ, ఆమె ఢిల్లీ వేదికగా చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి. తనపై రాబోయే చర్యలను అడ్డుకునేలా డిఫెన్స్‌లో ఉండాల్సిన సురేఖ.. ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరినే ప్రశ్నిస్తూ అటాకింగ్ మోడ్‌లోకి వెళ్లడం కాంగ్రెస్ పెద్దలను తీవ్ర పొలిటికల్ డైలమాలోకి నెట్టింది.

ముందు సీఎంపై చర్యలు తీసుకోండి:

ఢిల్లీ మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడిన సురేఖ, తనపై క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోవాలో చెప్పడం కంటే.. పార్టీలో చర్యలకు ప్రాతిపదిక ఏమిటన్న ప్రశ్నను లేవనెత్తారు. "పార్టీలో చర్యలు తీసుకోవాలనుకుంటే ముందు సీఎం రేవంత్ రెడ్డిపైనే తీసుకోవాలి" అని స్పష్టం చేశారు. 'పదేళ్లపాటు నేనే సీఎం' అని ఆయన చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, క్రమశిక్షణ కొలమానం అందరికీ ఒకేలా ఉండాలని అధిష్ఠానాన్ని డిమాండ్ చేశారు.

సామాజిక కోణం.. సీనియర్ల అసంతృప్తి:

తనపై చర్యల ప్రచారానికి సురేఖ సామాజిక రంగును కూడా పులిమారు. బీసీ నేతలకు ఒక న్యాయం, ఇతరులకు మరొక న్యాయమా అని ప్రశ్నించారు. అంతేకాకుండా, "పార్టీలో కేవలం నేనే కాదు.. చాలామంది మంత్రులు, సీనియర్ నాయకులు అసంతృప్తితో ఉన్నారు" అని పేర్కొనడం ద్వారా తన వ్యక్తిగత అసంతృప్తిని పార్టీలోని సమగ్ర సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు.

హైకమాండ్‌కు సరికొత్త సవాల్:

కొండా సురేఖ సంధించిన ఈ 'చిట్‌చాట్ అస్త్రం' నేరుగా ఢిల్లీ అధిష్ఠానానికే సందేశంగా మారింది. ఇప్పుడు ఆమెపై చర్య తీసుకుంటే బీసీ వర్గాలకు, అలాగే సీఎంపై చర్య తీసుకోకపోవడంపై సమాధానం చెప్పాల్సి వస్తుందన్న సంకేతాన్ని పంపారు. సురేఖ వ్యూహం ఆమెను క్రమశిక్షణ వేటు నుంచి కాపాడుతుందా లేక ముఖ్యమంత్రిని బహిరంగంగా సవాల్ చేసినందుకు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తుందా అనేది వేచి చూడాలి.

# 22ఏ నిబంధనలపై మహేంద్ర హిల్స్ వాసుల ఆగ్రహం

**ఎంపీ ఈటల రాజేందర్‌కు పలు కాలనీల సంక్షేమ సంఘాల వినతిపత్రం.**

**16 కాలనీలపై ప్రభావం.. సెప్టెంబర్ 5న ఇందిరా పార్క్ వద్ద 'మహాధర్నా'.**

**కంటోన్మెంట్ సమస్యలపై బోర్డు సభ్యురాలు బానుక నర్మదకు వినతి**

**మారేడ్‌పల్లి (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి, సెప్టెంబర్ 02):**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 22ఏ నిబంధనల (రెవెన్యూ ఆంక్షలు) కారణంగా మహేంద్ర హిల్స్ పరిధిలోని దాదాపు 16 కాలనీల ప్రజలు తీవ్ర తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా త్రిమూర్తి కాలనీ, శాంతినికేతన్ కాలనీ, ధనలక్ష్మీ కాలనీ, రవి కాలనీ, బాలంరాయి కాలనీ, సంతోష్ కాలనీ, వైజయంతి కాలనీ వాసులు ఆస్తి హక్కులు, రిజిస్ట్రేషన్ల





పరంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై మహేంద్ర హిల్స్ పరిధిలోని కాలనీవాసులు, వివిధ సంక్షేమ సంఘాల ప్రతినిధులు మేడ్చల్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌ను కలిసి తమ ఆవేదనను వెళ్లబోసుకుని వినతిపత్రం అందజేశారు. 22ఏ వల్ల ఇక్కడి ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎంపీకి వివరంగా తెలియజేశారు. అనంతరం, త్రిమూర్తి కాలనీలో నివాసముంటున్న కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణను ఎంపీ ఈటల రాజేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

**5వ తేదీన ఇందిరా పార్క్ వద్ద 'మహాధర్నా':**

22ఏ సమస్యపై ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకపోవడంతో, సమస్య తీవ్రతను సర్కారుకు తెలియజేసేందుకు ఈ నెల 5వ తేదీన ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద శాంతియుత 'మహాధర్నా' నిర్వహించనున్నట్లు కాలనీ ప్రతినిధులు ప్రకటించారు. ఈ ధర్నాకు మహేంద్ర హిల్స్ పరిధిలోని ప్రజలు, బాధితులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**కంటోన్మెంట్ మౌలిక సమస్యలపై వినతి:**

అదేవిధంగా కంటోన్మెంట్ పరిధిలో నెలకొన్న పలు రోడ్ల దుస్థితి, వీధి దీపాలు, డ్రైనేజీ సమస్యలు, బీటీ మరియు సిమెంట్ రోడ్ల నిర్మాణ అవసరాన్ని వివరిస్తూ కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ మెంబర్ బానుక నర్మదా మల్లికార్జున్‌కు కాలనీవాసులు మరో వినతిపత్రం అందజేశారు. కాలనీల్లోని ప్రాథమిక సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, మాజీ ఎమ్మెల్యే ఏండ్ల లక్ష్మీనారాయణ, బీఎన్ శ్రీనివాస్, వివిధ కాలనీల ప్రతినిధులు మధుసూదన్, రఘు, రవి, సుభాష్, బాబ్ల కొణిజేటి సంతోష్, గోయల్, నర్సింగరావు, లక్ష్మీకాంతం, కార్యవర్గ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.